

# ఫారిన్ వెళ్ళాల(న)ండీ



## - వసుంధర

***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు (డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – ‘మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?’ అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యూనబర్గులో ‘పీజీ టు కేజీ’ గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది ‘బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే’లో తొలివిడతగా ‘ఫన్ నేనొక్కడినే’. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

### రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

### *చివరి విడత: మలి సందడి (49)*

# ఫారిన్ వెళ్లానండి

రచనః వసుంధర

1974-75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది - అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి - రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి - చదవడం మొదలెడితే - ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016-2020లోనూ - 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యూనబర్గులో 'పీజీ టు కేజీ'. రెండవది 'బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే' మార్చి 2018లో ముగిసింది. ఏప్రిల్ 2018నుంచి చివరి విడతలో 'మలి సందడి' అంశాల వివరణ మొదలైంది. ఇవి కూడా జరిగిన వరుస క్రమంలో కాక, పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకం కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

**నేనూ నా కెటలిస్టులూ**

నేను తయారు చేసిన కెటలిస్టుల్ని స్టడీ చెయ్యడానికి ఎంచుకున్నది– వాటర్ గాస్ షిఫ్ట్ రియాక్షన్. అందుకు అవసరమైనవి ఆర్గాన్, కార్బన్ మోనాక్సయిడ్– గ్యాస్ సిలిండర్లు. స్టీమ్ జనరేటర్. 1 నుంచి 20 అట్మాస్ఫియర్ల ఒత్తిడిని తట్టుకోగల రియాక్టర్. లోనికి వెళ్లే బయటికొచ్చే వాయువుల పరిమాణాల్ని కొలిచే గాస్ క్రోమటోగ్రాఫ్. టెంపరేచర్, ప్రెషర్ పరిమాణాల్ని తెలిపే మీటర్లు.

బెర్గర్ బృందం సహకారంతో ఈ రియాక్టర్ సిస్టమ్– తయారు కావడానికి ఆరేడు నెలలు పట్టింది.

రియాక్షన్ అధిక ఒత్తిడిలో స్టడీ చెయ్యాలి కాబట్టి– ఈ సిస్టమ్‌లో కనెక్షన్లన్నీ ఎక్కడా లీక్ అన్నది లేకుండా టైటుగా ఉండాలి.

మనం ఇళ్లలో వాడే ప్రెషర్ కుక్కర్లో లీక్ లేకుండా రబ్బర్ గాస్కెట్ వాడతాం. ఐతే అందులో ప్రెషర్ రెండు అట్మాస్ఫియర్లు దాటదు. దాటితే కుక్కర్ పేలే ప్రమాదం కూడా ఉంది.

రియాక్టర్లో ఒత్తిడి 1 నుంచి 20 అట్మాస్ఫియర్లదాకా ఉంటుంది. కనెక్షన్సు దగ్గర ప్రత్యేకమైన వాషర్లు వాడాలి. నట్లు-స్క్రూలు చాలా టైటుగా బిగించాలి. ఏమాత్రమూ లీక్ లేకుండా చూడ్డం ఈ సిస్టమ్‌కి చాలా అవసరం.

రియాక్షన్ జరిగేది కార్బన్ మోనాక్సయిడ్, నీటి ఆవిరి మధ్య. ఎంతెంత పంపుతున్నదీ గాస్ క్రోమటోగ్రాఫ్ లెక్క చెబుతుంది. ఐతే మన చుట్టూ ఉండే వాతావరణంలో ఆక్సిజను, తేమ వగైరాలుంటాయి కాబట్టి, రియాక్షన్ పైన వాటి ప్రభావం పడే అవకాశముంది. రియాక్షన్ కేవలం మనం పంపిన వాయువుల మధ్యనే జరగాలంటే, అందుకు రియాక్టర్లో వాతావరణం జడంగా ఉండాలి. అందుకు రియాక్టర్ని ముందు జడవాయువులతో నింపాలి. తర్వాత జడవాయు ప్రవాహాన్ని కొనసాగిస్తూనే, రియాక్షనుకి అవసరమైన వాయువుల్ని మనకి కావాల్సిన కొలతల్లో పంపాలి. వాయువుల పరిమాణాల్నీ, నిష్పత్తుల్నీ, ఒత్తిడినీ, రియాక్టర్ టెంపరేచర్నీ మార్చుకుంటూ- అత్యధికమైన కన్వర్షనుకు కావాల్సిన కండిషన్సు కనుక్కోవాలి. స్థిరమైన కన్వర్షన్ రావడానికి రియాక్షన్ని కనీసం 36 గంటల సేపు కొనసాగించాలి.

ఈ తతంగం ప్రతి శాంపిలుకీ ఉంటుంది.

మా రియాక్షనుకి జడవాయువుగా ఆర్గాన్ గ్యాస్ వాడాం. అది జడం కాబట్టి లీకయినా ప్రమాదం లేదు. నీటి ఆవిరి లీకైనా ప్రమాదం లేదు. సమస్యంతా కార్బన్ మోనాక్సయిడ్ తోటే. అది విషవాయువు.

లీక్ విషయం అలాగుంచితే- రియాక్టర్లో ఒత్తిడిని మార్చడం మరో పెద్ద సమస్య. ఆ మార్పు స్టీమ్ జనరేటర్ నుంచి పంపే నీటి ఆవిరి ప్రవాహగతిపై ఆధారపడి ఉంటుంది. ఆ ప్రవాహగతిని శాసించేది, డోసియర్ పంపు ద్వారా స్టీమ్ జనరేటర్లోకి పంపే నీటి ప్రవాహగతి. ఆ గతిలో చిన్న మార్పు చాలు- ఒత్తిడిని ఎన్నో రెట్లు పెంచడానికి.

పుస్తకాల్లో చదివి జీర్ణించుకున్న విశేషాలే ఐనా- వాస్తవంలో, అందులోనూ ఆదిలో- ఇవన్నీ కత్తిమీద సామే!

అంతవరకూ నేను గాస్ సిలిండర్లతో కానీ, హై ప్రెషర్ రియాక్టర్లతో కానీ పనిచెయ్యలేదు.

చిన్నప్పుడు సోడా కొట్లలో గాస్ పట్టే తతంగం చూసి, అమ్మో అనుకునేవాణ్ణి. ఒత్తిడి ఎక్కువై మెషీన్ పేలిన వార్తలు విని బెదిరిపోయేవాణ్ణి. ఇంతా చేసి ఆ ఒత్తిడి రెండు అట్మాస్ఫియర్లే!

ఇక ఇంట్లో వాడే ప్రెషర్ కుక్కర్ని నేనెప్పుడూ గృహసాధనంగానే తప్ప రియాక్టరుగా గుర్తించలేదు.

బెర్లిన్లో మా లేబరేటరీలో- సిలిండర్లు, రియాక్టర్లతో పని చేస్తున్న చాలామందిని గమనించాను. వాటితో వ్యవహరించడాన్ని చాలా లైటుగా కూడా తీసుకున్నాను. ఇప్పుడూ తీసుకునేవాణ్ణి నాదాకా రాకపోతే!

నా టెస్టింగ్ ప్రక్రియకు అలవాటు పడ్డంకోసం ముందు కొన్ని డమ్మీ రన్స్ చేశాను. ఆ పాట్లు, వివరాలు అప్రస్తుతం.

నాలుగు రోజుల్లో కొంచెమేమిటి, బాగా ధైర్యం వచ్చింది. "ఓస్, ఇంతేనా?" అని కూడా అనిపించింది.

జర్మనీలో ప్రసిద్ధి చెందిన గిర్డ్‌లర్ కంపెనీ కెటలిస్టుల్ని పరిశ్రమల్లో ఈ రియాక్షనుకి వాడతారు. నేను వాటి శాంపిల్సు ముందుగానే తెప్పించి ఉంచుకున్నాను.

నేను తయారు చేసిన కెటలిస్టులతో పోల్చడానికి ముందు– రియాక్టర్లో పారిశ్రామికంగా ఉపయోగిస్తున్న ఆ శాంపిల్సు వాడి చూడాలి. మా కెటలిస్టులు వాటిలో మూడింట రెండొంతుల ప్రభావం చూపినా ఎంతో కొంత సాధించినట్లే అనుకోవచ్చు.

గిర్డ్‌లర్ కంపెనీ కెటలిస్టులతో ట్రయల్ రన్సు బాగా జరిగాయి. కన్వర్షన్ 40 శాతానికి అటూ ఇటూగా వచ్చింది. రాలెక్ కూడా ఎంతో సంతోషించాడు– రియాక్టర్ బాగా పని చేస్తోందని.

ఇక నా కెటలిస్టులతో టెస్టింగు మొదలెడితే– అప్పుడు జరిగింది అద్భుతం.

అది అహమ్మద్ సంకల్పబలమో, తథాస్తు దేవతల దీవెనో– మా కెటలిస్టు 98–99 శాతం కన్వర్షన్ ఇచ్చింది.

నా సంతోషానికి మేర లేదనుకుంటే– నన్ను మించిన సంతోషం అహమ్మద్‌ది.

ప్రయోగాలు నేనొక్కణ్ణే చేసుకుంటున్నా– అతడు రోజులో కనీసం ఐదారుసార్లు నన్ను కలిసి రియాక్షన్ యోగక్షేమాలు విచారించేవాడు. కన్వర్షన్ ఇంత బాగా వచ్చిందని తెలియగానే, అతడు లేబరేటరీ అంతా టాం టాం వేసేశాడు.

వార్త కార్చిచ్చులా పాకింది. చాలామంది కొలీగ్సు వచ్చి నన్ను అభినందించి వెళ్లసాగారు.

ఇది నాకు ఇబ్బందిగా అనిపించింది. ఏదైనా నిలకడమీద సాధించడం నాకిష్టం.

పరిశ్రమలను నడిపిస్తూ ప్రపంచప్రఖ్యాతి కాంచింది గిర్డ్‌లర్ కెటలిస్టు. అందుకు ఆ కంపెనీ ఎన్నో ట్రయల్సు– అదీ భారీ ఎత్తున చేసి ఉంటుంది. ఒక చిన్న లేబరేటరీలో ఓ చిన్న రియాక్టర్లో చిన్న ప్రయోగం చేసి– నా కెటలిస్టు అంతకంటే గొప్పదని ఎలా అనుకుంటాను?

సైన్సులో ఇలా డిగ్రీ తెచ్చుకుని అలా నోబెల్ ప్రైజు సాధించడం సాధ్యమా? ఆ వెనుక ఎంత కృషి ఉండాలి?

వార్త రాలెక్‌కి తెలిసి పరుగున నా వద్దకొచ్చాడు. ఫలితాల్ని ఒకటికి రెండుమార్లు పరీక్షించాడు. వాటిని గిర్డ్‌లర్ కెటలిస్టు ఫలితాలతో సరిపోల్చాడు.

“ఇది నేనూహించలేదు. నిజంగానే మన కెటలిస్టు అద్భుతం” అన్నాడు.

కానీ ఆ పొగడ్తకు తగ్గ భావం ఆయన కళ్లలో కనబడలేదు. గొంతులో వినబడలేదు.

‘ఒక సామాన్య భారత శాస్త్రజ్ఞుడు, అంతంతమాత్రం పరిజ్ఞానంతో– సాంకేతికంగా, వైజ్ఞానికంగా అత్యున్నత స్థానంలో ఉన్న విదేశీ (ఆయనకు స్వదేశీ) కెటలిస్టుని మించిపోవడమా?’ అన్న అసంతృప్తి ఆయన మొహంలో కనబడింది.

కలిసి పని చేస్తున్నాం కాబట్టి, మర్యాదకు 'మన' అన్నప్పటికీ, ఆయన నా శాంపిల్సుని ఇండియన్ ప్రోడక్ట్సుగానే భావిస్తాడని తెలుసు నాకు. ఐనా ఆయన పొగడ్త నాకు కొంత సంతోషాన్నిచ్చింది.

"అద్భుతమన్నది చాలా పెద్ద మాట! ఫలితాలు బాగున్నాయి కాబట్టి కొంచెం ఉత్సాహంగా ముందుకెళ్లొచ్చు. అంతే!" అన్నాను.

అప్పుడు రాలెక్ మొహంలో కొంచెం సంతృప్తి కనబడింది, "అది నిజమే కానీ, కన్వర్షన్లో మన కెటలిస్టు గిర్డ్లర్ని మించిపోవడం నిజం. ఈ విషయంలో నీ అభిప్రాయమేమిటి?" అన్నాడు.

"ఒకేఒక్క ప్రయోగంతో నేనే నిర్ణయానికీ రాలేను. అదీకాక, గిర్డ్లర్‌ది ఇండస్ట్రియల్ కండిషన్లలో టన్నుల్లో వాడినప్పుడు నిరూపితమైన ప్రోడక్టు. మన కెటలిస్టు లేబరేటరీ కండిషన్లో, మిల్లీగ్రాముల్లో వాడగా వచ్చిన ఫలితాలివి. రెంటినీ ఎలా పోల్చగలం?" అన్నాను.

రాలెక్ మరికొంచెం తృప్తి పడ్డాడు. కానీ అదే లేబరేటరీ కండిషన్లో గిర్డ్లర్ కెటలిస్ట్ ఇచ్చిన ఫలితాలు గొప్పగా లేవన్న విషయం ఆయన బుర్రను దొలిచేస్తోందని ఊహించగలను. ఎందుకంటే అదే నా బుర్రనూ దొలిచేస్తోంది.

"ఇప్పుడేం చేద్దామనుకుంటున్నావ్?" అన్నాడు రాలెక్.

అదాయన పద్ధతి. తన బుర్రలో ఏదో ఉంటుంది. చెప్పడు. నన్నే అడుగుతాడు. తన బుర్రలో ఏముందో అదే నేనూ చెప్పేదాకా, ఏమేమో సందేహాలు వెలిబుచ్చుతూనే ఉంటాడు. తననుకున్న సమాధానం వచ్చేక సరేననడమే కాదు, నా విచక్షణని ప్రశంసిస్తాడు కూడా.

గురువులకు ఇది అనుసరించతగ్గ మంచి పద్ధతి. ఆలోచనలో శిష్యుణ్ణి గురువు స్థాయికి తీసుకుపోయి, శిష్యుడిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు సహకరించే చక్కని పద్ధతి.

అప్పటికి ఆయనతో చాలా నెలలు వ్యవహరించి ఉన్న నాకు ఆయన మనసులో ఏముందో తెలియదా?

"నేను నా పద్ధతిలో చేసినవి ఇలాంటివి మొత్తం ఏడు రకాల కెటలిస్టు శాంపిల్స్ ఉన్నాయి. ఒకటిప్పుడు టెస్టు చేశాం. మిగతావీ టెస్టు చేద్దాం. ఈ కెటలిస్టు తయారీకి పుస్తకాల్లో ఇచ్చిన రొటీన్ పద్ధతిలో చేసినదీ ఓ శాంపిల్ ఉంది. దాన్నీ టెస్టు చేద్దాం" అన్నాను.

అనుకున్నట్లే రాలెక్ దాన్ని వెంటనే ఓకే చేశాడు.

నా ట్రయల్సు మొదలయ్యాయి. నేను చేసిన శాంపిల్సన్నీ కూడా 98-99 కన్వర్షన్ ఇచ్చాయి.

అంతవరకూ బాగానే ఉంది. పుస్తకాల్లో ఇచ్చిన రొటీన్ పద్ధతిలో చేసిన శాంపిల్ కూడా అదే ఫలితాన్నిచ్చింది.

అంతే! ఒక్కసారిగా నా ఉత్సాహం మీద నీళ్లు చల్లినట్లయింది. ఇది నేనూహించలేదు.

రాలెక్ మాత్రం, "ఇలా జరుగుతుందని ఊహించాను. నువ్వూ ఊహించి ఉంటావనే నా నమ్మకం. అందుకే అప్పుడు ఇండస్ట్రియల్, లేబరేటరీ కండిషన్ల గురించి మాట్లాడావు. యు ఆర్ టూ మెట్యూర్డ్" అన్నాడు.

నాలో మళ్లీ ఉత్సాహం. "అన్ని శాంపిల్సూ ఒకే ఫలితాన్నిచ్చినా మన పరిశోధనకో ప్లస్ పాయింటుంది. రొటీన్ పద్ధతిలో తయారు చేసిన పది గ్రాముల శాంపిల్ని వడబోసి నీటితో కడగడానికి 24 గంటలకు పైగా పట్టింది. మన శాంపిల్సు వడబోతకి పావుగంట కంటే ఎక్కువ పట్టదు. అందువల్ల ఇండస్ట్రియల్ లెవెల్లో ఎంత సమయం, వ్యయం కలిసొస్తుందో వేరే చెప్పాలా?" అన్నాను.

రాలెక్ వెంటనే, "ప్లస్ పాయింటదొక్కటే కాదు. లేబరేటరీ కండిషన్లో మన శాంపిల్సు గిర్డ్లర్ని మించిపోయాయి" అన్నాడుత్సాహంగా.

నేను నవ్వి, "అది భ్రమ అని నీకెప్పుడో తెలిసుంటుంది. నాకూ తర్వాత అర్థమయింది" అన్నాను.

"ఏమర్థమయింది?" అన్నాడు రాలెక్ కుతూహలంగా.

"ఆ కెటలిస్ట్ శాంపిల్ మనం మార్కెట్లో కొన్నాం. అది బిళ్లల రూపంలో ఉంది. తయారనప్పుడు శాంపిల్ పౌడరులా ఉంటుంది కదా! బిళ్లలుగా మార్చడానికి దానికి ఏదో బైండర్ కలపాలి. టాబ్లెట్ మెషీన్లో ప్రెస్ చెయ్యాలి. ఈ మార్పుల వల్ల దాని కన్వర్షన్ శక్తి తగ్గడం సహజం. కానీ పరిశ్రమల్లో బిళ్లలే తప్ప పౌడర్లు వాడడానికి వీలు కాదు కదా!" అన్నాను.

రాలెక్ మొహం వెలిగింది, "ఏదో కారణముండాలనుకున్నాను కానీ, ఎందుకో నాకిది స్ఫురించలేదు. మరి మన రియాక్టర్లో పౌడర్లనే వాడుతున్నాం" అని, "అన్నట్లు కంపెనీ శాంపిల్ని పౌడరు చేసేకే కదా వాడాం. ఐనా కూడా....." అన్నాడు సాలోచనగా.

ఏవేవో కలిపి, దానిపై ఒత్తిడి తెచ్చి బిళ్లగా చేసేక దాన్ని నూరితే వచ్చిన పౌడరు శాంపిలుకీ, తయారీలోనే పౌడరుగా వచ్చిన శాంపిలుకీ ఉండే తేడా ఒకోసారి హస్తిమశకాంతరం కావచ్చని నాచేత చెప్పించాలని ఆయన ఉద్దేశ్యమయుండొచ్చు. అది నెరవేర్చాను.

రాలెక్ మరింత తృప్తిపడి, "ఏదేమైనా ఈ పరిశోధన సత్ఫలితాలు ఇచ్చినట్లే అనుకోవాలి. పేటెంటుకి అవకాశముందని కూడా అనిపిస్తోంది. అందుకు మనం చాలా లోతుగా స్టడీస్ కొనసాగించాల్సి ఉంటుంది. వివిధ కండిషన్లలో స్టడీ చెయ్యాలంటే ఒకో శాంపిలుకీ 2-3 రోజులు పడుతుంది. అది నీ ఒక్కడివల్లా అవదు" అన్నాడు.

అలా లూయిజీ నావద్ద చేరాడు. ఐతే ఇక్కడో చిన్న అపార్థం వచ్చింది.

శాంపిల్స్ సిద్ధం. రియాక్టరు సిస్టమ్ సిద్ధం. టెస్టింగ్ ప్రొసీజర్ సిద్ధం.

తన ప్రాజెక్ట్ పని నల్లేరుపై బండి నడక అని లూయిజీ అనుకున్నాడు. కానీ పని మొదలైన నెల రోజుల్లోనే అతడి కలలు కల్లలయ్యాయి.

ఒత్తిడి పెంచినప్పుడల్లా రియాక్టర్ లీకయ్యేది. నట్లూ, స్క్రూలూ బిగించడానికి భుజబలం ఎక్కువ అవసరపడేది. నేనూ, లూయిజీ ఎయిర్ కండిషన్డ్ వాతావరణంలో కూడా– గనిలో, వనిలో, కార్ఖానాలో పని చేసే శ్రామికుడిలా చెమటలు కక్కేవాళ్లం.

మధ్యలో గాస్ క్రోమటోగ్రాఫ్ ట్రబులిచ్చేది. డోసియర్ పంపు ట్రబులిచ్చేది. ఆదిలో అలాంటి సమస్యల్ని పరిష్కరించడానికి బాగా ఎక్కువ సమయం పట్టేది.

మొత్తంమీద ఒకో శాంపిల్ మీద స్టడీస్ పూర్తి చెయ్యడానికి ఒకోసారి పది రోజులు పట్టేది.

"ఇలాగైతే ఈ స్టడీస్ ఎప్పటికి పూర్తి కాను?" అన్నది లూయిజీ బెంగ.

మరో సమస్య ఏమిటంటే–

రియాక్షన్ మొదలయ్యేక సిస్టమ్ ఆపడానికి లేదు. సుమారు 250–400 డిగ్రీల సెల్సియస్ టెంపరేచర్లో, 1–20 అట్మాస్ఫియర్ల ఒత్తిడిలో, ఆగకుండా పనిచేసే స్టీమ్ జనరేటర్, ఓపెన్ అయి ఉన్న గ్యాస్ సిలిండర్సు– వీటిని వాటి మానాన వదిలి వెళ్లడానికి లేదు కదా! ఎవరో ఒకరు దగ్గరుండాలి. పగలు ఫరవాలేదు. పనివేళలు, లంచి టైములు మార్చుకోవచ్చు. అదీకాక లేబరేటరీలో ఎవరో ఒకరుంటారు. మరి రాత్రి.....?

"ఒక రాత్రి నువ్వు, ఒక రాత్రి నేను వంతులవారీగా సిస్టమ్‌కి కాపలా కాద్దాం" అని లూయిజీకి చెప్పాను.

లూయిజీ నొచ్చుకుని, "నువ్వొద్దులే, రాత్రిళ్లు నేనుంటాను" అన్నాడు. ఎంత నొక్కించినా వినలేదు. ఐనా నాకే అది అమానుష మనిపించింది. అందుకని రాలెక్ చేత చెప్పించాలనుకున్నాను.

రాలెక్ నేను చెప్పింది విని ఆశ్చర్యపడ్డాడు. అందుకు ఒకటి కంటే ఎక్కువ కారణాలే ఉన్నాయి.

"ఇది నీ పీహెచ్‌డి స్టడీ కాదు. డాడ్ స్కాలర్సుగా వచ్చి సత్ఫలితాలు సాధించినవాళ్లున్నారు కానీ, ఇలా రాత్రింబవళ్లు కష్టపడడం నమ్మలేకుండా ఉన్నాను" అన్నది మొదటి కారణం.

"లూయిజీ నావద్ద చేరి కొన్ని నెలలయింది. ప్రాజెక్ట్ పూర్తి చెయ్యడానికి మామూలుగా రెండేళ్లు. కనీసం ఏడాది పడుతుంది. అందుకు శ్రమ పడక తప్పదు. అతడికోసం నువ్వెందుకు శ్రమపడాలి?" అన్నది రెండో కారణం.

"కంటిన్యుయస్ రియాక్షన్లకోసం లేబరేటరీలో మెయింటెనెన్స్ స్టాఫ్ ఉన్నారు. వాళ్లకి అప్పజెబితే దగ్గరుండి చూసుకోవడమేకాక, ఆ సమయంలో అవసరమైతే రీడింగ్సు కూడా తీసుకుంటారు. మీరొచ్చి ఇక్కడ రాత్రిళ్లు ఉండడమెందుకు?" అన్నది మూడో కారణం.

రాత్రిళ్లు లేబరేటరీలో పడుకునే సమస్యకు అలా పరిష్కారం లభించింది. ఐనా రియాక్షన్ గతిని బట్టి– రాత్రిళ్లు అక్కడుండిపోవాల్సిన అగత్యం అప్పుడప్పుడు కలిగేది. అలాంటప్పుడు లూయిజీ అక్కడుండిపోయేవాడు.

లూయిజీ రాత్రిళ్లు లేబరేటరీలో ఉండాల్సొచ్చినప్పుడు, సాయంత్రం ఐదుకి బదులు 3–4 గంటల మధ్యలో ఇంటికెళ్లిపోయేవాడు. రాత్రి తొమ్మిది దాటేక భార్యా సమేతంగా లేబరేటరీకి వచ్చేవాడు. పడుకుందుకు అక్కడ ఏర్పాటుండేది.

అలాంటి రోజుల్లో నేను సాయంత్రం ఐదుకి ఇంటికెళ్లకుండా లేబరేటరీలో రియాక్టరుకి కాపలాగా ఉండిపోయేవాణ్ణి. శ్రీమతి నాకోసం ఫలహారం పాక్ చేసి, పిల్లల్ని తీసుకుని 7–8 మధ్యలో అక్కడికొచ్చేది.

పెళ్లయినప్పట్నించీ నేనూ, తనూ వేరే వేరే ఊళ్లలో ఉన్నప్పుడు తప్ప– విడిగా భోంచేసిన సందర్భాలు తక్కువ. ఇప్పుడు ఒక్కణ్ణే తినడం వెలితిగా అనిపించి, తనని కూడా లేబరేటరీకి ఫలహారం తెచ్చుకోమని చెప్పాను మొదటి రోజున.

“ఆమాత్రం నాకు తోచకపోలేదు. కానీ పిల్లలు కూడా మనతోపాటు తామూ లేబరేటరీలోనే తింటామంటున్నారు. అక్కడ మిమ్మల్ని తప్ప బయటివాళ్లని తిననివ్వరని చెప్పాను” అని వెంటనే సంజాయిషీ ఇచ్చింది శ్రీమతి.

“అవున్లే, జాతకాల్ని తీసిపారేస్తాం కానీ, మనకేం జరగాలో అన్నీ వాటిలోనే రాసిపెట్టుంటాయని ఇప్పుడనిపిస్తోంది” అని నిట్టూర్చాను.

“ఉన్నట్లుండి జాతకాల ప్రసక్తి తెచ్చారేం?” అంది శ్రీమతి అశ్చర్యంగా.

“నీకు ఓ రైతుతో పెళ్లవుతుందనీ, పల్లెటూరి జీవితం గడుపుతావనీ, గంపెడు పిల్లలుంటారనీ– నీ జాతకంలో ఉండేదిగా” అన్నాను.

“ఐతే?!”

“ఈ లేబరేటరీ ఓ పొలం. నేనో రైతుని. నాకు భోజనం తెచ్చే రైతు భార్యవి నువ్వు” అన్నాను.

ఈ మాట నేననడం మొదటిసారి కాదు.

విశాఖపట్నంలో ఆంధ్రా యూనివర్సిటీలో రీసెర్చి చేస్తున్నప్పుడు కూడా నేను లేబరేటరీలో ఉండిపోతే తను నాకోసం కేరియర్ తెచ్చేది. రాత్రి పదింటికి కలిసి ఇంటికొచ్చేవాళ్లం. అప్పుడనేవాణ్ణి ఈ మాట.

శ్రీమతికి అది గుర్తొచ్చినట్లుంది, “అవున్లెండి. ఇంట్లోనే కూర్చునేవాళ్లకి– బెర్లిన్లో ఉంటేనేం, స్వంతూర్లో ఉంటేనేం– రెండూ ఒకటేగా! అంచేత నాది పల్లెటూరి జీవితమే! ఇక పిల్లలంటారా, వీళ్లిద్దరూ గంపెడుమంది పెట్టు” అని నవ్వేసింది.

కొరివితో తల గోక్కోవడమంటే ఇదే!

జర్మనీ వచ్చేక మేము బెర్లిన్ తప్ప మరో ఊరు చూడలేదు. బహుశా చూడమేమో కూడా!

శ్రీమతి నన్ను దెప్పుతోందనుకోవచ్చు. కానీ ఇలాంటివి తీగ తెగేదాకా లాగే అలవాటు మాకు లేదు. లూయిజీ వచ్చేదాకా మేమక్కడ సరదాగా కబుర్లు చెప్పుకునేవాళ్లం.

బాబుకి పెద్దగా తెలియకపోయినా, పాప లేబరేటరీ వాతావరణాన్ని చూసి, కుతూహలంతో చాలా ప్రశ్నలు వేసేది.

పాపని అప్పుడే సైన్సు నాలెడ్జిలో ముంచెత్తెయ్యాలన్న కోరిక నాకు లేదు. అందుకని కథలు చెప్పేవాణ్ణి.

ఇలా కథలు చెప్పడం నాకు పుట్టుకతో వచ్చింది. మచ్చుకి–

భువనేశ్వర్లో ఉద్యోగంలో జాయినవడానికి సతీ సమేతంగా మెయిల్లో వెడుతున్నప్పుడు– శ్రీకాకుళం దాటేక వచ్చిన సుమ్మాదేవి అనే ఊరి పేరు చూసి, “ఊరికి ఇలాంటి పేరెక్కడా వినలేదు” అని శ్రీమతి ఆశ్చర్యపడింది.

అప్పుడామెకు పదహారేళ్లు. చేసిన రైలు ప్రయాణాలే వేళ్లమీద లెక్కెట్టొచ్చు. తెలిసిన ఊళ్లూ తక్కువే.

“నీకు కాశీమజిలీ కథలు తెలుసుగా! అందులో ఓ సిద్ధుడు కాశీకి వెడుతూ, తోడుగా గోపన్న అనేవాణ్ణి తీసుకెడతాడు. ఆ గోపన్నకి ఎక్కడైనా కొత్తగా ఏమన్నా కనబడితే అడుగు ముందుకి పడేది కాదు. సిద్ధుడివద్ద ఏ విశేషానికి సంబంధించిన కథనైనా తెలుసుకునే మహిమ ఉన్న మణి ఒకటుంది. దాని సాయంతో ఆయన ఆ కథ తెలుసుకుని వాడికి చెప్పేవాడు. మీ నాన్నగారు పెళ్లికి పెట్టిన ఉంగరముందే, దానికి నేను వేయించిన రాయి అలాంటి మణే. దాని సాయంతో సుమ్మాదేవి కథ చెప్పనా?” అనడిగాను శ్రీమతిని.

తను చెప్పమంది. నేను చెప్పాను.

అదక్కడితో ఆగలేదు. తర్వాతనుంచి ఆమె వచ్చే ప్రతి ఊరి వెనుకా కథా అడగసాగింది.

అవధానికి అప్రస్తుత ప్రసంగంలా నాకది సవాలయింది. ఐతే నేను కథ చెప్పగానే అభినందనపూర్వకంగా, ముచ్చటగా చూసే ఆమె చూపు– సామాన్య వానరంలాంటి నా ఊహాశక్తిని, హనుమంతుడి పరిమాణానికి పెంచేసేది.

దాంపత్యపు తొలిరోజుల్లో మరపురాని మధుర ఘట్టాల్లో ఆ రైలు ప్రయాణమొకటి.

ఇప్పుడు సంసార సాగరయానంలో– పిల్లలతో మధుర ఘట్టాలు నడుస్తున్నాయి.

అప్పుడు శ్రీమతి– ఇప్పుడు కొమరిత.

రియాక్టర్ని మాంత్రికుడి గుహగా మార్చేశాను. కొంచెం సైన్సు, కొంచెం మంత్రం, కొంచెం సాహసం, కొంచెం చమత్కారం– ఇవన్నీ కలిసి ఓ పెద్ద కథ తయారైంది.

పాప పెద్ద పెద్ద కళ్లు చేసుకుని ఎంతో కుతూహలంగా వింది. కథ మొదలైన కొద్ది క్షణాల్లోనే బాబు కూడా శ్రోతగా మారిపోయి బుద్ధిగా విన్నాడు. ఆశ్చర్యమేమంటే శ్రీమతి కూడా ఆ సమయంలో వాళ్లలో తనూ ఒకతె అయింది.

కథ పూర్తయ్యేక పాప చాలా ఆనందపడింది. నా కెటలిటిక్ రియాక్టరు దానికిప్పుడు ఓ జానపద కథకు స్థావరంలా, చిత్ర విచిత్రాల సమ్మేళనంగా అనిపిస్తోంది.

కథ ఐపోవడం బాబుకి అంత తృప్తిగా ఉన్నట్లు లేదు. వాడు పాపని గోకి, “అక్కా! ఇంకేమైనా అడుగు. నాన్నగారు ఇంకో కథ చెబుతారు” అన్నాడు వాడి యాస తెలుగులో.

తనూ అడగొచ్చని వాడికి స్ఫురించినట్లు లేదు. అదీకాక ఆ వయసులో తమ్ముడికి అక్కమీద ఉండే ఆరాధనాభావమొకటి!

అంతలో లూయిజీ సతీ సమేతంగా వచ్చాడు. పరస్పరం పలకరింపులు. మర్యాదకి కుశల ప్రశ్నలు.

వాళ్లకీ మాకూ కామన్ టాపిక్సేముంటాయ్– పది నిముషాల్లో మేం 'వీడర్ జెహెన్ చెప్పి అక్కణ్ణించి బయల్దేరాం.

నడుచుకుంటూ హాల్లో మెట్ల దగ్గరికి రాగానే పాప అడిగింది, "రాలెక్ అంకుల్ లేరా?" అని.

దానికి రాలెక్‌తో చిన్న పరిచయముంది.

ఒకరోజు సాయంత్రం అప్పటికప్పుడు బయటికి వెళ్లే ప్రోగ్రాం అనుకుంది శ్రీమతి. అందుకని పిల్లల్ని తీసుకుని ఐదు కాకుండా లేబరేటరీకి వచ్చేసింది.

అప్పుడు నేను రాలెక్‌తో మట్లాడుతున్నాను. ఆయన మావాళ్లని చూసి విష్ చేసి శ్రీమతికి షేక్‌హేండిచ్చాడు. అది చూసి పాప కూడా చెయ్యి సాచింది.

ఆరడుగులకి చాలా ఎక్కువే ఉండే అంతెత్తు మనిషి రాలెక్. నేనే ఆయనముందు పిట్టలా ఉంటాను. ఇక పాప సంగతి చెప్పాలా?

ఆయన ముచ్చటగా పాపని చూసి, తన చూపుడు వేలుని ముందుకి సాచాడు. పాప తన చిట్టి చేతులతో ఆ వేలిని పట్టుకుంది.

ఆ హేండ్–ఫింగర్ షేక్ పాపకి కొత్తగా, వింతగానే కాదు, వినోదంగానూ అనిపించింది. ఇంటికొచ్చి ఆ సన్నివేశాన్ని తల్చుకుని తల్చుకుని నవ్వింది. మరోసారి రాలెక్‌నుంచి అలాంటి షేక్‌హేండ్ పొందాలనుంది దానికి.

"లేరమ్మా!" అని ఏదో చెప్పబోగా, "ఇప్పుడింకో కథ మొదలెట్టకండి. ఇంకేమైనా కబుర్లు చెప్పుకుందాం" అంది శ్రీమతి.

"కథ ఉంటే చెప్పాలిగా మరి" అన్నాను. ఇంతకీ నాకప్పుడు కథ చెప్పే ఉద్దేశ్యం లేదు.

"అసలే మన పాపకి గుర్తెక్కువ. పెద్దయ్యేక ఎవరైనా అడిగితే, 'చిన్నప్పుడు జర్మనీలో ఉండేవాళ్లం. మా నాన్నగారు లేబరీటరీలో మాకు కథలు చెప్పేవారు' అనగలదు జాగ్రత్త!" అని హెచ్చరించింది.

"పాయింటే" అనుకున్నాను.

నలుగురం భవనంలోంచి రోడ్డుమీదకి వచ్చాం.

అప్పటికి సమయం పది కావస్తోంది.

ఆ సమయంలో ఆ ఏరియాలో నడవడం కొత్త మాకు.

ఎర్నస్ట్‌రాయిటర్ ప్లాట్జ్ దాకా నడిస్తే అక్కడ ఊబాన్ దొరుకుతుంది. తదుపరి స్టేషన్ డాయిచే ఓపర్‌లోనే మేం దిగాలి.

కానీ ఆ సమయంలో ఊబాన్ ఎక్కడం ఇష్టం లేదు. ఎందుకంటే పిల్లలతో నడిచినా మాకు కలిసొచ్చే సమయం పది నిముషాల లోపే!

మా పిల్లలు చక్కగా నడుస్తారు. నడవడానికి ఇష్టపడతారు కూడా.

ఆ రోజు నడుస్తూ మేమో చిత్రం చూశాం.

రోడ్లకి పక్కన ఫుట్‌పాత్ లుంటాయిగా– అవి చాలా విశాలంగా ఉంటాయి. వాటి పొడుగునా రంగురంగుల పూలు పూసే సీజనల్ మొక్కలుంటాయి. వాటిని దాటుకుంటూ నడవడమే ఆహ్లాదకరమైన అనుభవం.

అప్పుడు జరుగుతున్నదేమంటే– కొంతమంది తోటమాలులు– పూలమొక్కల్ని మార్చేస్తున్నారు. మొక్కలతోపాటు అవి పూసిన పూల రంగులూ మారిపోతున్నాయి. అంటే తరచుగా ఫుట్‌పాత్‌మీద ఉండే పూలమొక్కల్ని ఇలా రాత్రిపూట మార్చేస్తుంటారన్న మాట!

నిత్యావసరమైన బాటల్నీ, ఆ బాటలపక్కన ఉండే మురుగుకాల్వల్నీ– మరమ్మతులొచ్చినా వాటి మానానికొదిలేసి– ఖర్మం చాలక వాటికి మరమ్మతు చేస్తే– ఘనకార్యం చేసినట్లు ఫీలయ్యే మన మునిసిపాలిటీలెక్కడ?

తమ నగరాన్ని నిత్యనూతనంగా తీర్చి దిద్దాలన్న తపనతో, రాత్రికి రాత్రి కొత్త పూలమొక్కల్ని నాటే ఈ భావన ఎక్కడ?

మన సంస్కృతి, సంప్రదాయాల్ని ఘనమైనవిగా పదే పదే వల్లించే మనలో ఎక్కడో ఏదో లోపముందనిపించదూ!

పేదరికం, అధిక జనాభా– అన్నవి కుంటిసాకులు. మన ధ్యేయం, దృక్పథం– వీటిని సమీక్షించుకోవాలి!

మేమా మనోహర దృశ్యాన్ని చూసి పరవశిస్తూ– నెమ్మదిగా ఇల్లు చేరుకున్నాం.

పిల్లలు వెంటనే పడుకున్నారు కానీ– మాకు వెంటనే నిద్ర పట్టలేదు.

అవీ ఇవీ మాట్లాడుకొనడంలో లూయిజీ ప్రసక్తి వచ్చింది. యథాలాపంగా రీసెర్చి వర్కు విషయంలో అతడికి కలిగిన ఆశాభంగం గురించి చెప్పి జాలి పడ్డాను.

శ్రీమతి జాలి పడలేదు. అప్పుడామె అన్న మాటలు– నేనూహించనివి......

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments